RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 125 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | మంగళవారం, మే.5, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## అస్సాంలో కమలం హ్యాట్రిక్..?

**న్యూఢిల్లీ,మే 04:**అస్సాంలో బీజేపీ హవా కొనసాగుతుంది. రికార్డు స్థాయి విజయం సాధించి ముచ్చటగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా దూసుకుపోతుంది. మైనార్టీల శాతం అధికంగా ఉన్న రాష్ట్రంలో బంపర్ మోజారిటీ దిశగా సాగుతుంది. అయితే బీజేపీకి ఇంత భారీ విజయం దక్కడం వెనుక ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ రాజకీయ ఎత్తుగడలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అసోంలో ప్రభుత్వ పథకాలు ముఖ్యంగా మహిళలను బాగా ఆకర్షించాయి. 'అరుణోదోయ్' ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు ప్రభుత్వానికి పెద్దఎత్తున మైలేజ్ ఇచ్చాయి. ఈ పథకం మతాలకు అతీతంగా పేద మహిళల మద్దతును కూడగట్టుకునేలా చేసిందిదానితో పాటు స్థానిక అస్సామీలకు ప్రత్యేక గుర్తింపునిచ్చేలా "భూమిపుత్రులకు రక్షణ" అనే నినాదంతో ఆయన ప్రచారం సాగించారు. అక్రమ చొరబాటుదారుల అంశాన్ని బలంగా వినిపిస్తూ, స్థానిక అస్సామీ సంస్కృతిని కాపాడతామనే భరోసానివ్వడం స్థానికంగా ఎంతో కలిసివచ్చింది. అయితే సంప్రదాయ పద్ధతిలోనే కాకుండా రోడ్ షోలు, బహిరంగ సభల్లో ప్రజలతో నేరుగా మమేకమయ్యే తీరు ఆ రాష్ట్రంలో యువతను బాగా ఆకర్షించింది. హిమంత బిశ్వశర్మ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ 2023లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అస్సాం రాజకీయాల్లో కీలక మార్పు తెచ్చింది. దీనివల్ల మైనార్టీ ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్న స్థానాల సంఖ్య తగ్గింది. ఫలితంగా, స్థానిక అస్సామీ జనాభా ప్రభావం ఉన్న స్థానాల్లో బీజేపీ బలం పెరిగింది. గతంలో కాంగ్రెస్, (బద్రుద్దీన్ అజ్మల్ పార్టీ) కలిసి పోటీ చేసేవి. కానీ ఈసారి విడివిడిగా లేదా బలహీనమైన కూటములతో పోటీ చేయడం



వల్ల మైనార్టీ ఓట్లు చీలిపోయి బీజేపీకి మేలు జరిగింది.దానితో పాటు తిరుగుబాటు దారుల సమస్య అధికంగా ఉండడంతో ఆ సమస్య ప్రధానంగా ఎన్నికల ?ప్రచారం సాగింది.రాష్ట్రంలోని వివిధ హిందూ వర్గాలను (అస్సామీ, బెంగాలీ, గిరిజనులు) బీజేపీ ఒకే తాటిపైకి తీసుకురాగలిగింది. 2015 వరకూ జాతీయ కాంగ్రెస్‌లో కీలక నేతగా కొనసాగిన హిమంత బిశ్వశర్మ హస్తంతో విభేదాల కారణంగా బీజేపీలో చేరారు. చేరిన ఏడాదికే ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రాగా తన ఎత్తులతో 15 ఏళ్లుగా బీజేపీ కూటమిని అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ కోటకు బీటలు వారింది. అయితే ఆసమయంలో సర్బానంద సోనోవాలా ముఖ్యమంత్రి కాగా అతని క్యాబినెట్‌లో హిమంత మంత్రిగా పనిచేశారు.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు దిశగా టీవీకే విజయ్

చెన్నై: తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు దిశగా టీవీకే చీఫ్ విజయ్ అడుగులు వేస్తున్నారు. పార్టీ అభ్యర్థులకు విజయ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. అభ్యర్థులంతా చెన్నై రావాలని పిలుపు ఇచ్చారు. ట్రెండ్ ప్రకారం మ్యాజిక్ ఫిగర్ 118కి చేరువలో టీవీకే ఆగిపోనుంది. మధ్యాహ్నం 3 గంటల నాటికి 107 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మ్యాజిక్ మార్క్ రాకపోతే ఎవరితో పొత్తు పెట్టుకోవాలన్నదానిపై విజయ్ చర్చలు జరుపుతున్నారు. విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు కాంగ్రెస్, పీఎంకే సిద్ధంగా ఉన్నాయి. త?మిళనాడులో అతిపెద్ద పార్టీగా విజయ్ టీవీకే అవతరిస్తోంది. మరోవైపు, కాసేపట్లో తమిళనాడు సీఎం స్టాలిన్ గవర్నర్‌ను కలవనున్నారు. సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. కాంగ్రెస్ ఇప్పటికే విజయ్‌కు మద్దతు ఇస్తామన్న సంకేతాలు పంపింది. అలాగే టీవీకే పార్టీతో అధికారాన్ని పంచుకోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని విజయ్ తండ్రి చంద్రశేఖర్ సూచించారు. ఎన్నికల ముందు దశలో టీవీకే.. ఎఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, డీఎంకే రెండింటితోనూ కూటములను పూర్తిగా తిరస్కరించింది.



అయితే, మెజారిటీ మార్కు దాటేందుకు టీవీకేకు చిన్న ద్రావిడ పార్టీల మద్దతు అవసరం కావచ్చు. తమిళనాడుకు ఎంజీఆర్ వంటి సినీ తారలను నాయకులుగా ఎన్నుకున్న దీర్ఘ చరిత్ర ఉంది. ఇప్పుడు ఆ జాబితాలో విజయ్ కూడా చేరారు.

## ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి

### అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్,మే 04:**పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొనగా, కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. పిపిసి కేంద్రాలకు మొత్తం 21.34 లక్షల మెట్రిక్ టన్నుల వరి చేరగా ఇప్పటి వరకు 13.32 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగాఉండేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల తడిసిన వరిని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకుతరలించాలని సూచించారు. రైతులకు వాతావరణ హెచ్చరికలను నిరంతరం అందించాలని, జిల్లా స్థాయిలో తగినంత టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని పిపిసి కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు.



మెరుపు, వానల సమయంలో రైతులు కరెంట్ స్తంభాలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఐకెపి, పిఎసిఎస్ ల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లుకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించడంలో రవాణా సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు.

## రేవంత్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాం: కేటీఆర్

సంగారెడ్డి, మే 04: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం చేశారని విమర్శించారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. అందుకే ఈ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని వివరించారు. సీఎం, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ఈ సందర్భంగా రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎంకి భూముల కొనుగోళు



,, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు తదితర కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసిన లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు కేటీఆర్. రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతులకు ధైర్యం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరం అయితే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఆ క్రమంలో ఈ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రకటించారు.


## కామ్రేడ్లకు భారీ షాక్.. చివరి కోట పతనం!



న్యూఢిల్లీ: భారత రాజకీయ ముఖచిత్రంపై ఒక సంచలన మార్పు చోటుచేసుకుంది. అర్ధ శతాబ్దం పాటు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల పాలన ఇప్పుడు చరిత్రలో మిగిలిపోయింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఓటమి పాలుకావడంతో, 50 ఏళ్ల తర్వాత దేశంలో ఏ ఒక్క కమ్యూనిస్టు ముఖ్యమంత్రి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఇది కామ్రేడ్ల రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే ఒక పరిణామం అని విశ్లేషకులు అంటున్నారు. ఒకప్పుడు దేశంలో అత్యంత బలమైన రాజకీయ శక్తిగా వెలుగొందిన వామపక్షాలకు ఇంతకాలం కేరళ చివరి కంచుకోటగా మిగిలింది. 1977 నుండి 2011 వరకు పశ్చిమ బెంగాల్‌ను, 1993 నుండి 2018 వరకు త్రిపురను పాలించిన కమ్యూనిస్టులు.. అక్కడ వరసగా తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల చేతిలో పరాజయం పాలయ్యారు. కేరళలో మాత్రం ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారే సంప్రదాయాన్ని 2021లో తిరగరాసి అధికారాన్ని నిలబెట్టుకున్న లెఫ్ట్ ఫ్రంట్, తాజా ఎన్నికల్లో మాత్రం తన ఆఖరి కోటను కోల్పోయింది. దీంతో 1977 తర్వాత తొలిసారిగా దేశం కమ్యూనిస్ట్ పాలన లేని శకంలోకి అడుగుపెట్టింది. కేరళలో ఎదురైన ఈ ఘోర పరాజయం వామపక్షాల జాతీయ రాజకీయ ప్రాబల్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇన్నాళ్లూ కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల అండతో సీపీఎం, సీపీఐ, తదితర వామపక్ష పార్టీలు జాతీయ స్థాయిలో తమ బలానికి మించి ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి.

## ఖలిస్థాన్ తీవ్రవాదులతో జాతీయ భద్రతకు ముప్పు

ఒట్టావా, మే4: ఖలిస్థాన్ వేర్పాటువాదుల విషయంలో కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. ఖలిస్థాన్ వేర్పాటువాదులు తమ దేశ జాతీయ భద్రతకు ముప్పుగా కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. తమ హింసాత్మక తీవ్రవాద ఎజెండాను కెనడాలో ప్రచారం చేయడానికి వేర్పాటువాదుల బృందం వివిధ సంస్థలను వాడుకుంటున్నదని పేర్కొన్నది. ఆదివారం ఈ మేరకు '2025 పబ్లిక్ రిపోర్ట్'ను విడుదల చేసింది. కెనడా కేంద్రంగా ఖలిస్థాన్ వేర్పాటువాదుల (సీబీకేఈ) హింసాత్మక కార్యకలాపాలు ఈ దేశానికి, కెనడా ప్రయోజనాలకు ముప్పుగా నివేదిక పేర్కొన్నది. 'కెనడా పౌరులతో సంబంధాలు కొనసాగిస్తున్న సీబీకేఈ.. తీవ్రవాద ఎజెండా ప్రచారానికి వారిని ఉపయోగించుకుంటున్నది. అమాయక పౌరుల నుంచి నిధులు సేకరించి, వాటిని హింసాత్మక కార్యకలాపాల వైపు మళ్లిస్తున్నది' అని నివేదిక తెలిపింది. నివేదికను కెనడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో




అందుబాటులోకి తీసుకొచ్చింది. జస్టిన్ ట్రూడో తర్వాత కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మార్క్ కార్నీ.. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఇరాన్ ప్రతిపాదనలపై సమీక్షిస్తా..ట్రంప్



అమెరికాతో చర్చల అంశంపై ఇరాన్ చేసిన తాజా ప్రతిపాదనలనకు సమీక్షిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో తాను యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నానని చెప్పాడు. ఈ అంశంపైతాజాగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్‌లో ప్రకటన చేశారు. ఇరాన్ తాజాగా చేసిన ప్రతిపాదనలపై సమీక్షిస్తున్నట్లు, అయితే, వాటిని అంగీకరిస్తానో లేదో తెలియదన్నారు. అయినప్పటికీ ఇరాన్‌పై సైనిక చర్యకు ఇంకా అవకాశాలున్నాయని ట్రంప్ చెప్పారు. అయితే, 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవజాతికి ఇరాన్ చేసిన దానికి ఆ దేశం ఇంకా పరిహారం చెల్లించుకోలేదని ట్రంప్ అన్నారు. ఇరాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించినా, తప్పుగా ప్రవర్తించినా మరోసారి దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తాజాగా అమెరికాకు ఇరాన్.. 14 అంశాలతో నూతన ప్రతిపాదనలు పంపింది. పాకిస్తాన్ ద్వారా తమ సమాచారాన్ని చేరవేసింది. ఈ అంశంలో నిర్ణయం అమెరికా చేతిలోనే ఉందని ఇరాన్ తెలిపింది. తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అయితే, తమ సైన్యం ఎలాంటి చర్యకైనా సిద్ధంగానే ఉందని వెల్లడించింది.అయితే, అంతకుముందు అమెరికా కూడా ఇరాన్‌కు తొమ్మిది అంశాలతో ప్రతిపాదనలు పంపింది.

## కార్యకర్తల శ్రమ ఫలితమే ఈ విజయం

### ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,మే 04:**పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి విజయం ఖరారైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. రాష్ట్ర బీజేపీ కార్యకర్తలను అభినందించారు. వారి కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. మంచి పాలన అందించాలన్న బీజేపీ అభిమతమే అంతిమంగా పైచేయి సాధించిందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు బీజేపీకి అద్భుతమైన విజయాన్ని అందించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ విజయం కోసం రాష్ట్రంలో పార్టీకి చెందిన కొన్ని తరాల కార్యకర్తలు నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. కొన్నేళ్ల పాటు క్లిష్ట పరిస్థితుల్లో పోరాడారని అన్నారు. కార్యకర్తలే పార్టీ శక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్తకూ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. బీజేపీకి మర్చిపోలేని విజయం అందించినందుకు



రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని కూడా ప్రధాని మోదీ చెప్పారు.

# సంపాదకీయం

## భారత్ లో పెరుగుతున్న ఆటమ్నల్ రొమాన్స్..!

ఒకప్పుడు అరవై ఏళ్లు వచ్చాయంటే... ఆధ్యాత్మిక చింతన, మనవలు, మనవరాళ్లతో కాలక్షేపం, విశ్రాంతి జీవితం మాత్ర మే గుర్తుకు వచ్చేది. కానీ ఆధునిక భారత వృద్ధతరం మాత్రం నాకొక గాల్ ఫ్రెండ్ కావాలిరా అంటూ పాడుకుంటున్నారు. యూత్‌తో పోటీ పడి మరీ డేటింగ్ యాప్‌ల్లో ఖాతాలు తెరు స్తున్నారు. ప్రేమ, తోడు కోసం సెకండ్ ఇన్నింగ్స్ కోసం అ డుగులువేస్తున్నారు. విదేశాల్లో సాధారణమైన ఆటమ్నల్ రొ మాన్స్ అంటే మలి వయసు ప్రేమ ఇప్పుడు భారత్‌లో కూడా చాలా వేగంగా విస్తరిస్తోంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా సింగిల్ మిక్సర్స్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వారు రిటైర్‌మెంట్ ప్లాన్లు, ఆరోగ్య విశేషాలు చర్చించుకుంటూనే తమకు నచ్చిన తోడును ఎంచు కుంటున్నారు. భారత్‌లో సగటు ఆయుర్దాయం 50 నుంచి 71 ఏళ్లకు పెరిగింది. అంటే రిటైర్‌మెంట్ తర్వాత కూడా సుమారు రెండు దశాబ్దాల జీవితం మిగిలే ఉంటోంది. పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో స్థిరపడటం వల్ల సుమారు 15 శాతం మంది వృద్ధులు నగరాల్లో ఒంటరిగా ఉంటున్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఒంటరిగా ఉండటం మానసిక ఆందోళనలు, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వీటిపై అవగాహన పెరిగింది. కేవలం శారీరక ఆకర్షణ కంటే, మనసు విప్పి మాట్లాడే ఒక తోడు ఉండాలనే కోరిక వారిని ఈ దిశగా నడిపిస్తోంది. "మేం కూడా సంతోషంగా ఉండటానికి అర్హులమే" అనే భావన ఇప్పుడు బలపడుతోంది. ప్రముఖ నటుడు ఆశిష్ విద్యార్థి 57 ఏళ్ల వయసులో రూపాలి బరువానువివాహం చేసుకున్నారు. జీవితంలో ఏ దశలోనైనా తోడు అవసరమని,సంతోషంగా ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ఆయన చెప్పుకొచ్చారు. వారిద్దరూ కలిసి ఫిఫ్టీ ప్లస్ జిందగీ అనే యూట్యూబ్ ఛానెల్ ద్వారా తమ ప్రయాణాన్ని పంచుకుంటున్నారు. బాలీవుడ్ నటి సుహాసిని ములే 60 ఏళ్ల వయసులో వివాహం చేసుకున్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయిన ఒక శాస్త్రవేత్తను పెళ్లి చేసుకున్నారు. సమాజం ఒత్తిడి వల్ల కాకుండా, తనకు తోడు కావాలని అనిపించినప్పుడు మాత్రమే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలబ్రిటీలే కాకుండా సామాన్యులు కూడా ఈ బాటలో ఉన్నారు. కేరళకు చెందిన గోకుల్ శ్రీధర్ అనే వ్యక్తి తన తల్లి పడుతున్న కష్టాలు చూసి పునర్వివాహం చేశాడు. ఇది 2013లో సంచలనంగా మారింది. కునాల్ అశోక అనే ఇద్దరు బాల్య స్నేహితులు సుమారు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పటికే వారి భాగస్వాములను కోల్పోయారు. చివరకు 2023లో వాళ్ల 60వ ఏట వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. టెక్నాలజీ కేవలం యువతకే కాదు, వృద్ధులకు కూడా వరంగా మారింది. నేడు భారతీయ వృద్ధులు ఉపయోగిస్తున్న టాప్ యాప్‌లు ఒకసారి పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. 50 ప్లస్ క్లబ్‌ను కేవలం వీళ్ల కోసమే రూపొందించారు. ట్రూలీ మాడ్లీ ఏ యాప్ కూడా 50 ప్లస్ వాళ్లకు క్రియేట్ చేశారు. ఇందులో సబ్‌స్క్రిప్షన్‌లు కోవిడ్ తర్వాత భారీగా పెరిగింది. క్వాక్‌క్వాక్ అండ్ బాంబుల్ అనే యాప్ ప్రాంతీయ భాషల్లో సపోర్ట్ చేస్తుంది. అందుకే ఇందులో ఉండే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అయితే డేటింగ్ యాప్‌లలో పురుషులు ఎక్కువగా యూజ్ చేస్తున్నారు. మహిళలు నేరుగా మిక్సర్స్, సిర్ఫ్ కాఫీ వంటి వెరిఫైడ్ సర్వీస్‌లను ఇష్టపడుతున్నారువా డేంటో అప్పుడే బట్టతల వచ్చేసింది. ఇంత తొందరగా ముస లాడు అయిపోయాడు" అని కామెంట్స్ చేస్తుంటారు. కొందరైతే మరీ దారుణంగా బాడీషేమింగ్ చేస్తారు. రియాల్టీ ఏంటంటే ప్రతి ఒక్కరూ లైఫ్‌లో ముసలోళ్లు అవుతారు. కానీ...అందరికీ ఈ వృద్ధాప్యం రెండు సార్లు వస్తుందట. ఇటీవల జరిగిన ఓ రీసెర్చ్‌లోఇదే విషయం వెల్లడైంది. సాధారణంగా రిటైర్ అయ్యే ఏజ్ వస్తే అప్పుడు ముసలితనం వచ్చేసినట్టు భావిస్తుంటాం. కానీ...అంత కన్నా ముందు నుంచే మన శరీరంలోని కణాల్లో శక్తి తగ్గిపోతుంది. 25-75 ఏళ్ల మధ్యలో ఉన్న వాళ్ల శరీరాల్లోని కణాల పని తీరుని ట్రాక్ చేశారు. ఆ క్రమంలోనే చాలా మందిలో 44ఏళ్ల నుంచే కణాల్లో వృద్ధాప్య ఛాయలు కనిపించడంమొదలైంది. 60ఏళ్లకు పూర్తి స్థాయిలో వృద్ధాప్యం వచ్చేసిందని గుర్తించారు. అంటే దాదాపు రెండు సార్లు ముసలితనం వచ్చేసినట్టే లెక్క. ఇలా శరీరంలోని కణాల్లో శక్తి మెల్లగా తగ్గిపోవడాన్నిలైనర్ ఏజింగ్ గా చెబుతున్నారు పరిశోధకులు. సాధారణంగా 40 ఏళ్లు వచ్చాక మహిళల్లో మెనోపాజ్ ఆగిపోతుంది.అప్పటి నుంచే వాళ్లకు వృద్ధాప్యం వచ్చినట్టు పరిగణిస్తారు. అయితే...పురుషుల్లోనూ 40 ఏళ్లు దాటాక ఇదే పరిస్థితి వస్తున్నట్టు ఈ పరిశోధన వెల్లడించింది. 44 ఏళ్లకు ఎప్పుడైతే వృద్ధాప్యం మొదలవుతుందో అప్పటి నుంచి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుందని ఈ రీసెర్చ్ స్పష్టం చేసింది. మద్యం సేవించే వాళ్లకు ఈ ముప్పు మరింత ఎక్కువ.ఇదేవయసులో మిగతా వ్యాధులు వచ్చేందుకూ ఆస్కారముంటుంది. 40-59 మధ్య వయసున్న వాళ్లలో 40% మందికి హార్ట్ అటాక్‌లు వచ్చే అవకాశముంద ని వివరించిం ది. 60 ఏళ్లు దాటాక ఈ రిస్క్ 75% వరకూ పెరుగుతుందని తేల్చి చెప్పింది. సరిగ్గా ఇదే వయసులో పార్కిన్‌సన్, అల్జీమర్స్ లాంటి వ్యాధులూ అటాక్ చేసే ప్రమాదముంది. 40 ఏళ్లు దాటగానే కొందరిలో చర్మం ముడతలుబడిపో తుంది. అదే వృద్ధాప్యానికి సంకేతం. ఈ వయసులోనే మోకాళ్ల నొప్పులు మొదలవుతాయి. గాయాలైతే అవి మానడానికీ చాలా సమయంపడుతుంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించిన వివ రాలప్రకారం..అంతర్జాతీయంగా 40 ఏళ్లకే వృద్ధాప్యం వస్తున్న దాఖలాలు పెరుగుతున్నాయి.




# ఒక్క రూపాయి లాభం చూపించి కోట్లు కొట్టేశారు!

**ఈ ఏడాది మొదటి రోజే రూ. 4.5 కోట్లు కొట్టేసిన సైబర్‌చీటర్స్**



హైదరాబాద్: సైబర్‌నేరాలు తగ్గుతున్నాయని ఒక పక్క అధికారులు చెబుతున్నా.. మరో పక్క నేరగాళ్లు పంజా విసురుతూనే ఉన్నారు. ఈ ఏడాది మొదటి రోజే మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 4.5 కోట్లు కొట్టేశారు. స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయని నమ్మిస్తూ× స్క్రీన్‌పై రూ.కోట్ల లాభం చూపించి.. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే ట్యాక్స్‌లు చెల్లించాలని నమ్మిస్తూ రూ.కోట్లు కాజేశారు. మోసపోయిన వారిలో ఒకరు వ్యాపారి కాగా× మరొకరు డిఫెన్స్ సంస్థలో పనిచేసిన రిటైర్డు అధికారి కావడం గమనార్హం.తన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, తెలిసిన వారు, బంధువుల వద్ద అప్పులు తెచ్చి ఇందులో పెట్టుబడి పెట్టగా ఒక్క రూపాయి లాభం చూపించి సైబర్‌నేరగాళ్లు కోట్లు కొట్టేశారు. పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నివాసముండే వ్యాపారి గత ఏడాది నవంబర్‌లో ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తుండగా ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ప్రకటన కన్పించింది. దానిని క్లిక్ చేయడంతో నోమురా సెక్యూరిటీస్‌కు సంబంధించి నోముజీక్యూ ఐ-189 పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌కు బాధితుడి నెంబర్‌ను యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లో ఉన్నవారు స్టాక్స్ గురించి చర్చించుకుంటూ మేం ఫలాన స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే ఇన్ని లాభాలొచ్చాయని చెప్పుకుంటూ స్క్రీన్ షాట్స్ షేర్ చేశారు. దీంతో తాను కూడా ట్రేడింగ్ చేసేందుకు ముందుకెళ్లాడు. ఈ నేపథ్యంలోనే సైబర్‌నేరగాళ్లు పంపించిన హెచ్5.ఏఆర్ఏవైఏఏ.ఆఆ పేరుతో పంపించిన లింక్‌ను క్లిక్ చేసి, యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అకౌంటర్ క్రియేట్ చేసుకున్నాడు. బాధితుడికి కావ్యారెడ్డి అనే పేరుతో ఒక చీఫ్ అపరేటర్, అడ్వయిజర్‌ను కేటాయించారు. దీంతో మొదట రూ.40 వేలు పెట్టుబడి పెట్టడంతో కొన్ని లాభాలు కన్పించాయి. వాటిని విత్‌డ్రా చేసుకున్నాడు. మీరు ఇలా చేస్తే ఎక్కువ లాభాలు రావని, క్యూ1బీ క్యాటగిరిలో ఐపీవోలు, హైనెట్ వర్త్ స్టాక్స్‌పై పెట్టుబడి పెడితే భారీ లాభాలు ఆర్జించవచ్చంటూ సూచనలు చేశారు. ఇలా రూ.49.6 లక్షలు పెట్టుబడి పెట్టడంతో యాప్‌లు పెట్టుబడితో పాటు లాభాలు రూ.1.68 కోట్లుగా కన్పించాయి. దీంతో భారీ లాభాలొస్తాయంటూ నమ్మించారు. తరువాత దఫ దఫాలుగా రూ. 2 కోట్ల వరకు పెట్టుబడి పెడుతూ వెళ్లాడు. స్క్రీన్‌పై రూ.9.28 కోట్ల లాభం కన్పించింది. స్క్రీన్‌పై కన్పిస్తున్న లాభాలు, పెట్టుబడులలో నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో సైబర్‌నేరగాళ్లను ప్రశ్నించాడు. ముందుగా మీరు రూ. 80.67 లక్షలు కమిషన్ చెల్లించాలని, ఆ తరువాతే మీకు విత్ డ్రా చేసుకునే అవకాశముంటుందని సూచించారు. అయితే వ్యాలెట్‌లో ఉన్న వాటిలో అవి మినహాయించుకొని మిగతావి ఇవ్వాలని బాధితుడు కోరితే.. అలా కుదరదని ముందుగా కమిషన్ చెల్లించాలని షరత్ విధించడంతో బాధితుడికి అనుమానం వచ్చి ఈ నెల 1వ తేదీన మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

**రిటైర్డు డిఫెన్స్ ఉద్యోగికి టోకరా:** కాప్రా ప్రాంతంలో నివాసముండే బాధితుడు డిఫెన్స్ సంస్థలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. టెలిగ్రామ్ యాప్‌ను బ్రౌజింగ్ చేస్తుండగా ఏపీ హెల్పింగ్ హ్యాండ్ ఇండియా పేరుతో ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌ను క్లిక్ చేయడతో తాము స్టాక్ ట్రేడింగ్‌లో విశ్లేషణ, స్టాక్స్ కొని అమ్మడంలో కస్టమర్‌కు సూచనలు, రిస్క్ మేనేజ్‌మెంట్ చేస్తూ అధిక లాభాలిప్పిస్తామని ఒక అప్లికేషన్ కన్పించింది. అందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న బాధితుడికి అమన్‌కుమార్ పేరుతో ఒక వ్యక్తి ఫోన్ చేసి కొన్ని సూచనలు చేశాడు, ఆ తరువాత బేస్ ఫార్మలీ కాయిన్ బేస్ వ్యాలెట్ పేరుతో ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. క్రిప్టో కరెన్సీతో బియాన్స్‌లో ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలొస్తాయని నమ్మించాడు. ఈ మేరకు ఆ యాప్‌లో అకౌంట్ క్రియేట్ చేసుకొని ట్రేడింగ్ మొదలు పెట్టాడు. దీనికి అమన్‌కుమార్‌తో పాటు అజిత్ దోవల్ అనే పేర్లతో ఇద్దరు వ్యక్తులు సలహాలు, సూచనలు ఇస్తూ వెళ్లారు. మీరు పెట్టే పెట్టుబడిని రూపాయ నుంచి యుఎస్‌డీటీలోకి మార్చి, మీ వ్యాలెట్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుందంటూ సూచనలు చేశారు. ఇదంతా ఇండియా, యూఎస్-ఫ్రీ మార్కెట్ ట్రేడింగ్‌పై ఆధారపడి ఉంటుందని నమ్మించారు. ఇలా బాధితుడు మొదట రూ. 3.85 లక్షలు పెట్టుబడి పెట్టడంతో కొన్ని లాభాలు చూపించారు. ఆ తరువాత మరో మూడు లక్షలు పెట్టుడి పెట్టాడు. అయితే యాప్‌లో స్క్రీన్‌పై రూ. 4.55 కోట్లు (5 లక్షల యుఎస్‌డీటీ) చూపించింది. అందులో ఉన్న వాటిని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించడంతో మీ లాభాలు అధికంగా ఉన్నాయని, అందుకే ప్రాఫిట్‌పై 30 శాతం ట్యాక్స్ చెల్లించాలని షరత్ విధించారు. దీంతో బాధితుడు రూ. 12.97 లక్షలు చెల్లించాడు, ఆ తరువాత రూ. 50 లక్షలు చెల్లిస్తూ వెళ్లాడు. ఇలా 494 సార్లు× రూ. 2,27,85,000 సైబర్‌నేరగాళ్లు సూచించిన ఖాతాలలోకి డిపాజిట్ చేశాడు. ఇందులో ఒక్క రూపాయి మాత్రమే తనకు లాభం అంటూ సైబర్‌నేరగాళ్లు ఇచ్చారని, తన రిటైర్ బెనిఫిట్స్‌తో పాటు బంధువులు, తెలిసిన వారి వద్ద అప్పులు తెచ్చి సైబర్‌నేరగాళ్లు సూచించినట్లు డిపాజిట్ చేశానని బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# చమురుపైనే చూపంతా!

**ప్రపంచంలోనే అత్యధికంగా వెనెజువెలాలో ఆయిల్ రిజర్వ్లు వాటిని చేజిక్కించుకునేందుకే అమెరికా దాడి అన్న నిపుణులు**



న్యూఢిల్లీ: వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అరెస్ట్ చేయడానికి కారణంగా డ్రగ్స్ బూచిని చూపిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసలు లక్ష్యం ఆ దేశంలోని భారీ చమురు నిక్షేపాలను కొల్లగొట్టడమేనని విశ్లేషకులు అంటున్నారు! అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మదురో నియంత, కిరాతకుడు అనే మాట నిజమే కానీ, ప్రెసిడెంట్ ట్రంప్ చేసిన పని చట్టవిరుద్ధం, నిర్లక్ష్యపూరితం అని విమర్శించారు. యూఎస్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇచ్చిన పోస్ట్‌లో, వేరొక దేశంపై దాడి చేసే అధికారం ట్రంప్‌నకు లేదని పేర్కొన్నారు. ఇప్పుడు తన నియంత్రణలో ప్రపంచంలోనే భారీ చమురు నిక్షేపాలు ఉన్నాయని, వీటి విలువ రూ.1,557 లక్షల కోట్లు అని ట్రంప్ మీడియాకు తెలిపారు. అమెరికాకు చెందిన పెద్ద ఆయిల్ కంపెనీలు వెనెజువెలాకు వెళ్తాయని, బిలియన్ల డాలర్లు ఖర్చుపెట్టి, సొమ్ము సంపాదించుకుంటాయని చెప్పారు.

**వెనెజువెలాలో ఎంత చమురు ఉంది?:** అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, వెనెజువెలాలో 300 బిలియన్ బ్యారెళ్ల కన్నా ఎక్కువ చమురు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం చమురు నిల్వల్లో ఇది 20 శాతం. దీని విలువ రూ.1,557 లక్షల కోట్లు అని అంచనా. ఈ చమురు హెవీగా ఉంటుంది, విద్యుదుత్పత్తి కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, నౌకలు, రోడ్డు నిర్మాణం, వాటర్‌ప్రూఫింగ్‌ల కోసం కూడా వాడతారు. అమెరికాకు 50 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఇది లైట్, స్వీట్ క్రూడ్. పెట్రోలు తయారీకి ఇది సరైనదే. ఇతర ఉత్పత్తుల తయారీకి అనువైనది కాదు. వెనెజువెలాలో రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రపంచం మొత్తం మీద రోజుకు ఉత్పత్తి అయ్యే చమురులో కేవలం 0.8 శాతం మాత్రమే వెనెజువెలాలో ఉత్పత్తి అవుతుంది.

**చమురు ఉన్నా వెనెజువెలాకు ఈ దుస్థితి ఎందుకు?:** ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు ఉన్న వెనెజువెలా తలసరి ఆదాయం విషయంలో 2025లో ప్రపంచంలో 127వ స్థానంలో ఉంది. దేశ జనాభాలో 90 శాతం మంది పేదలే. 2018లో ద్రవ్యోల్బణం 1.7 మిలియన్ శాతానికి చేరుకుంది. ఫలితంగా 50,000; 1,00,000 డినామినేషన్ నోట్లను ప్రభుత్వం ముద్రించింది. కోడిగుడ్లు కొనడానికి ప్రజలు 1,00,000 విలువ గల నోట్లను 20 తీసుకోవలసి వచ్చేది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి వల్ల దేశం ఈ దుస్థితిలో ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం చమురుపైన మాత్రమే ఆధారపడింది. 1970వ దశకంలో ఈ దేశంలో రోజుకు 3.5 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి జరిగేది. అంటే, ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న చమురులో సుమారు 7 శాతం అన్నమాట. క్రమంగా చమురు ఈ దేశ అతి పెద్ద బలహీనతగా మారింది. చమురు పరిశ్రమను 1976లో జాతీయీకరణ చేశారు. పీడీవీఎస్ఏ అనే ప్రభుత్వ కంపెనీని ఏర్పాటు చేశారు. 2002-03లో సమ్మె జరిగింది. ప్రభుత్వం 18,000 మంది వర్కర్లను తొలగించింది. చమురు నుంచి బిలియన్ల డాలర్లు సంపాదించినప్పటికీ, నిధులను పొదుపు చేయలేదు. 1980వ దశకంలో ధరలు పతనమవడంతో, మొత్తం వ్యవస్థ కుప్పకూలింది, ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 1992లో ప్రజలు ప్రెసిడెంట్ హ్యూగో ఛావెజ్‌పై తిరుగుబాటు చేశారు. కానీ విఫలమయ్యారు. 2004-2008 మధ్య కాలంలో చమురు ధరలు బ్యారెల్‌కు 140 డాలర్లకు పెరిగాయి. భారీ లాభాలు రావడంతో, ప్రభుత్వం ఉచిత గృహ నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, చౌక ధరలకు ఆహారం పథకాలను ప్రవేశపెట్టింది. ల్యాప్‌టాప్‌లు, నిత్యావస వస్తువులను పంపిణీ చేసింది.ప్రభుత్వం బలవంతంగా ఆహార ధరలను తగ్గించింది. ప్రైవేట్ కంపెనీలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఫలితంగా ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం చమురు ద్వారా వచ్చిన సొమ్ముతో అన్నిటినీ దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. దేశంలోని పరిశ్రమలు మూతపడ్డాయి, నిరుద్యోగం పెరిగిపోయింది. పీడీవీఎస్‌ఏని ఏర్పాటు చేసిన తర్వాత చాలా విదేశీ కంపెనీలు ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం వాటి ప్లాంట్లను స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత విదేశీ పెట్టుబడులు చెప్పుకోదగ్గ స్థాయిలో రాలేదు. నైపుణ్యం గల ఇంజినీర్లు, నిపుణులు పీడీవీఎస్‌ఏని వదిలిపెట్టారు, వారి స్థానాల్లో రాజకీయ ప్రేరేపిత నియామకాలు జరిగాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టలేదు, మెషినరీని మెయింటెయిన్ చేయలేదు. ఫలితంగా చమురు వెలికితీత సామర్థ్యం తగ్గుతూ వచ్చింది. 50 ఏళ్ల నుంచి పైప్‌లైన్లను అప్‌డేట్ చేయలేదని, రిఫైనరీలు దయనీయస్థితిలో ఉన్నాయని పీడీవీఎస్‌ఏ సర్ది చెప్తున్నది. మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, ఉత్పత్తి పునఃప్రారంభం కోసం 58 బిలియన్ డాలర్ల మేరకు ఖర్చవుతుంది.

**అమెరికా ఆంక్షలు..:** గతంలో వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారు అమెరికా. ఛావెజ్ విధానాలు, ప్రకటనల వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారుగా చైనా మారింది. చమురుకు బదులుగా 10 బిలియన్ డాలర్ల రుణాలను చైనా ఇచ్చింది. వెనెజువెలా చమురును అమ్ముతున్నప్పటికీ, ఆదాయాన్ని సంపాదించలేకపోతున్నది. 2018లో వెనెజువెలా ప్రభుత్వం అమెరికన్ డాలర్లలో వ్యాపారాన్ని నిషేధించింది. ఒక డాలర్‌కు 10 బొలివర్స్ ఎక్స్ఛేంజ్ రేట్‌ను నిర్ణయించింది. కానీ మార్కెట్ రేటు ఒక డాలర్‌కు 1,000కిపైగా బొలివర్లు ఉంది. 2019 తర్వాత అమెరికా, ఇతర దేశాలు వెనెజువెలా ఆయిల్ కంపెనీపై ఆంక్షలు విధించాయి.



## కాషాయం దేశ గౌరవం!!

# కమలం దేశ ప్రతిష్ట

**- బీజేపీ జెండా ప్రజల అజెండా- మోదీ నాయకత్వం భారత్ రక్షణ, ప్రజల సంక్షేమం -3 రాష్ట్రాల్లో అఖండ మెజారిటీతో కమలం వికాసం- బాణాసంచా, మిఠాయిలతో కార్యకర్తల సంబరాలు- గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో హర్షధ్వానాలు- బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి**





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) కాషాయం దేశ గౌరవానికి ప్రతీకగా, కమలం దేశ ప్రతిష్టకు నిదర్శనంగా నిలుస్తుందని, బీజేపీ జెండా ప్రజల అజెండాగా మారిందని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఉత్సాహభరితంగా హర్షం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వం భారత్ రక్షణకు, ప్రజల సంక్షేమానికి దిశానిర్దేశం చేస్తోందని ఆమె కొనియాడారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో అఖండ మెజారిటీ సాధించిన నేపథ్యంలో సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా సంబరాలతో కళకళలాడింది.

బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకుని బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవాన్ని ప్రజలతో పంచుకున్నారు. పార్టీ జెండాలు ఎగురవేస్తూ దేశభక్తి నినాదాలతో ప్రాంతం మార్మోగింది. కార్యకర్తల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత ఊపునిచ్చారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, ఈ విజయాన్ని ప్రజల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత సేవాభావంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. దేశ అభివృద్ధి పథంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. సాధించిన విజయాన్ని ప్రజలకే అంకితం చేస్తున్నామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయోత్సవం స్థానికంగా రాజకీయ చైతన్యాన్ని పెంచింది. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద లక్ష్యాలతో బీజేపీ ముందుకు సాగుతుందని చెప్పారు. నాయకత్వంపై ప్రజల నమ్మకం మరింత బలపడిందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వందేమాతరం పుట్టిన పవిత్ర భూమి ఇదే... భారత్ మాతాకీ జై అనే నినాదంతో మార్మోగిన గడ్డ కూడా ఇదే... అని సంధ్యారాణి గారు పేర్కొంటూ, దేశభక్తి భావనను మరింతగా ఉద్ఘాటించారు. మొత్తంగా గోదావరిఖని కేంద్రంగా విజయోత్సవం ఘనంగా జరిగింది. ప్రజలు కూడా నాయకులతో కలిసి విజయాన్ని ఆనందంగా జరుపుకు న్నారు....

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, సులువ లక్ష్మీనారాయణ, తడగొండ నరసయ్య మరియు మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ గుండబోయిన భూమయ్య, బోడకుంట సుభాష్, పాకాల నరసింహారెడ్డి,పంగ రవి,బియ్యాల మహేందర్,అందే రాజ్ కుమార్ చారి,పెండెం సత్యనారాయణ, గోగుల పరకాల మురళి గౌడ్, రేగొండ సంతోష్, జనగామ సాగర్, అమ్మ రాజు, కందుల సంతోష్ ,వీరబో యిన శ్రీనివాస్, తిప్పని స్వామి ,తిప్పని సురేష్, రాజు, జక్కుల ప్రవీణ్, పల్లాపు సంపూర్ణ, ఏల్తూరి సరిత- రాజయ్య ,హనుమాన్ల వెంకటేష్ ,మీస వికాస్, సిలారపు కళ్యాణ్, విజయ్ గౌడ్, జక్కుల పద్మ, ఏల్చూరి గౌరీ శంకర్, సింగారం శ్రీకాంత్,అంకరి భరత్ ,బుంగ మహేష్ పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ ప్రమాద స్థలంలో ట్రాఫిక్ బోర్డుల ఏర్పాటు -- రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు






(తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ) (04-మే-2026):స్థానిక ఎఫ్సీఐ ఎక్స్ రోడ్ నుండి ఆర్ఎఫ్సీఎల్ వెళ్ళే మార్గంలో రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు సోమవారం రోజున పరిశీలించినారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ వద్ద ప్రమాదం జరిగిన ప్రదేశంలో ట్రాఫిక్ సూచనా బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రజలు, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ రాజేశ్వరరావు కోరారు. టూ-వీలర్ వాహనదారులు హెల్మెట్ ధరించాలి, అతివేగంగా వెళ్లరాదు. ఫోర్-వీలర్ వాహనదారులు సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించాలి, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలి. మద్యం తాగి వాహనం నడపరాదని, అన్ని ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జీ. హరిశేఖర్, మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 10 ఏళ్ల మైలురాయి - ఆత్మీయ గెట్-టు-గెదర్ వేడుకలు



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)ఆర్జీ.1 ఏరియా. నందు గత పదేళ్లుగా కొనసాగుతున్న మినిస్టీరియల్ స్థాఫ్ సుదీర్ఘ ప్రయాణాన్ని పురస్కరించుకుని, 2016 బ్యాచ్/బృందం సభ్యులు సోమవారం నాడు ఆద్యా బ్యాంకేట్ హాల్ నందు ఆత్మీయ సమ్మేళనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. 2016లో ప్రారంభమైన ఈ ప్రయాణం విజయవంతంగా 2026 నాటికి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ 'దశాబ్ది ఉత్సవాల'ను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో 2016 బ్యాచ్ బృందం సభ్యులందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పదేళ్ల కాలంలో సాధించిన విజయాలను, ఎదుర్కొన్న సవాళ్లను ఒకరితో ఒకరు పంచుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. "పదేళ్ల క్రితం మొదలైన మా బంధం నేటికీ ఇంతే బలంగా ఉండటం గర్వకారణమని, మున్ముందు కూడా ఇదే స్నేహభావంతో మరిన్ని విజయాలు సాధించాలని" ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికి జ్ఞాపికలు అందజేసి విందు కార్యక్రమంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి రాజు, అన్వేష్, సుజిత్, పద్మ, మాలతి, తస్లీం బేగం సభ్యులు పాల్గొని సందడి చేశారు.

## ఏఐ, రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాం భేష్..!

**- ఇలాంటి సమ్మర్ కోచింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయి- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ**




(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగించుకునేందుకుతెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్, టీ ఫైబర్, సూపర్ టీచర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం'ను సోమవారం ప్రారంభమైంది. గాంధీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలోని గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌ను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి లెర్నింగ్ ప్రోగ్రాం తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్‌పై ప్రాయోగిక జ్ఞానం పొందాలని సూచించారు. భవిష్యత్తులో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ వినియోగం, ఏఐ యొక్క దైనందిన జీవితంలో ఉపయోగాలు, సరళమైన రోబోటిక్స్ నమూనాల తయారీ, ప్రాజెక్ట్ ప్రదర్శనలు వంటి అంశాల్లో ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఏంఈఓ మల్లేశం, డీఆర్పీ ఎన్.రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రాంబాబు, స్వరూప్ చంద్, రమేష్, పీఆర్పీ శ్రీలతతోపాటు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీరామ్ రాహూల్ జువ్వాడి బృందం పాల్గొన్నారు.

## 'సెల్ఫ్ ఎన్యుమరేషన్ సెన్సస్ 2027' జనగణన స్వయం నమోదు పై అవగాహన సదస్సు



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం, రామగుండం ఏరియా-1 పరిధిలోని ఉద్యోగులందరికీ "సెన్సస్ 2027 - సెల్ఫ్ ఎన్యుమరేషన్" (జనగణన స్వయం నమోదు) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఈరోజు కాన్ఫరెన్స్ హాల్, +వీ కార్యాలయం, =+-1 ఏరియా నందు సాయంత్రం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించటం జరిగినది. ఇట్టి సదస్సుకు యం. రవీందర్ రెడ్డి పర్సనల్ మేనేజర్ గారు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ అవగాహన సదస్సులో యం. రవీందర్ రెడ్డి పర్సనల్ మేనేజర్ గారు రాబోయే 2027 జనగణనలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' విధానంపై క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరికీ అవగాహన కల్పించడమే ఈ సమావేశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని జనగణన ప్రక్రియలో 'స్వయం నమోదు' దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న జనగణన కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈసారి పౌరులకు 'స్వయం నమోదు' సౌకర్యాన్ని కల్పించింది. ప్రజలు తమ ఇంటి నుండే సులభంగా, సురక్షితంగా తమ వివరాలను నమోదు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించడం జరిగింది. గతంలో జనగణన గణన అధికారులు ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు అడిగి ఫారమ్ నింపేవారు. కానీ ఇప్పుడు, ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి, తమ కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా ఎంటర్ చేయవచ్చు. నమోదు చేసుకునే విధానం: ప్రభుత్వం కేటాయించిన అధికారిక జనగణన పోర్టల్‌ను సందర్శించాలి. పౌరులు తమ మొబైల్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. దీనికి ఒక ్రూా వస్తుంది. కుటుంబ యజమానితో పాటు ఇంటి వివరాలను నింపాలి. నమోదు పూర్తయిన తర్వాత ఒక '=వటవతీవఅవెవ చీబఎ-ఎవతీ' వస్తుంది. దీనిని భద్రపరుచుకోవాలి. గణన అధికారి మీ ఇంటికి వచ్చినప్పుడు, కేవలం ఆ రెఫరెన్స్ నంబర్ చూపిస్తే సరిపోతుంది. వారు మళ్ళీ మిమ్మల్ని ప్రశ్నలు అడగాల్సిన అవసరం ఉండదు. దీనివలన సమయం ఆదా కావడమే కాకుండా ప్రజలు తమకు వీలైన సమయంలో వివరాలను నమోదు చేసుకోవచ్చు. వ్యక్తిగత వివరాలను నేరుగా ప్రభుత్వానికి పంపడం వల్ల భద్రత పెరుగుతుంది. గణనలో తప్పులు దొర్లకుండా ప్రజలు స్వయంగా తనిఖీ చేసుకుని వివరాలు ఇవ్వవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా జనగణనను పేపర్ రహితంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, దేశాభివృద్ధిలో కీలకమైన జనగణన ప్రక్రియలో ఉద్యోగులందరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమములో డిజియం ఎక్స్ ప్లోరేషన్ రమేష్, టిటిసి మేనేజర్ అశోక్ రావు, ఫైనాన్స్ ,మేనేజర్ మోహన్ రావు, మాధవి, సీనియర్ లా ఆఫీసర్, అఫ్రిన్ బేగం, డివైపియం వేణు, సీనియర్ పివోలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు అన్ని గనుల రక్షణ అధికారులు, సంక్షేమాదికారులు, జి.ఎం కార్యాలయానికి చెందిన అన్ని విభాగాల అధిపతులు, మెడికల్, సివిల్, వర్క్ శాఫ్, ఖజ మరియు సెక్యూరిటీ విభాగాల అధికార్లు పాల్గొన్నారు.

## వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. వాల్ నట్స్‌లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది. చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది.

## ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే

ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ొ%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# 'జబర్దస్త్'కు రీఎంట్రీ ఇచ్చిన నాగబాబు..




ఒకప్పుడు తెలుగు టెలివిజన్‌లో టాప్ రేటింగ్స్‌తో దూసుకెళ్లిన ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్', గత కొంతకాలంగా తన ప్రభావాన్ని కోల్పోయింది. పడిపోయిన రేటింగ్స్‌తో వెనుకబడిన ఈ షోకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చేందుకు నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా షోకు మొదటి నుంచి పెద్ద దిక్కుగా ఉన్న ప్రముఖ నటుడు నాగబాబును తిరిగి జడ్జ్‌గా తీసుకువచ్చారు. నాగబాబు రాకతో షోలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. "ఈ కుర్చీ ఎప్పటికీ మీదే సార్" అంటూ యాంకర్ రష్మీ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. తాను షోలో లేకపోయినా ఎప్పుడూ దాని గురించే ఆలోచించేవాడినని, ఎవరైనా తప్పు చేస్తే సెట్‌కు వచ్చి మందలించాలనిపించేదని అన్నారు. ఆయన మాటలు ఈ షోపై తనకున్న అనుబంధాన్ని తెలియజేశాయి. నాగబాబు నవ్వులు టీమ్‌లో కొత్త ఎనర్జీ నింపుతున్నాయని కమెడియన్లు చెబుతున్నారు. ప్రస్తుతం షోలో కొత్త కమెడియన్లు ఎక్కువగా ఉండగా, ఈ అంశాన్ని కూడా స్కిట్లలో సరదాగా ప్రస్తావిస్తున్నారు. మరోవైపు బుల్లెట్ భాస్కర్ స్కిట్‌లో "నేను ఏమైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అయ్యానా?" అంటూ వేసిన పొలిటికల్ సెటైర్ కూడా బాగా పేలింది. దీంతో భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని ఉండొచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు. నాగబాబు తన పాత టీమ్‌ను, ముఖ్యంగా చమ్మక్ చంద్ర వంటి వారిని మళ్లీ వెనక్కి తీసుకొస్తారా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ మార్పులతో జబర్దస్త్ మళ్లీ తన పాత స్థానాన్ని దక్కించుకుంటుందో లేదో చూడాలి.

# 29 ఏళ్లకే కన్నుమూసిన నటి దివ్యాంక సిరోహి..



ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ నటి దివ్యాంక సిరోహి 29 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. డిగ్రీ పూర్తి చేసిన దివ్యాంక సిరోహి ప్రస్తుతం ఘజియాబాద్లో తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. చిన్న స్థాయి నుండి కెరీర్ ప్రారంభించిన ఆమె, ఉత్తరప్రదేశ్ మరియు హర్యానా ప్రాంతాల్లో లోకల్ భాషల మ్యూజిక్ ఆల్బమ్స్‌లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాదాపు 50కి పైగా మ్యూజిక్ వీడియోల్లో నటించిన ఆమె, తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల్లో కూడా చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ, హీరోయిన్‌గా ఎదగాలని కృషి చేస్తున్న సమయంలోనే ఈ విషాదం చోటుచేసుకోవడం బాధాకరం. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉండేది. తరచూ తన ఫోటోలు, వీడియోలతో అభిమానులతో టచ్‌లో ఉండేది. ఏప్రిల్ 21 మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స అందుకుంటూనే ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ వార్తతో ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. దివ్యాంక సిరోహి మరణం ఉత్తరప్రదేశ్, హర్యానా సంగీత పరిశ్రమలో కూడా తీవ్ర విషాదాన్ని నింపింది. అనేకమంది సెలబ్రిటీలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు. యువ ప్రతిభావంతురాలు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడం అందరినీ కలచివేస్తోంది. బాలీవుడ్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలలు కంటున్న సమయంలోనే ఆమె ప్రయాణం ముగియడం నిజంగా విషాదకరం. నిన్న మధ్యాహ్నం ఘజియాబాద్లో ఆమె అంత్యక్రియలు నిర్వహించగా, భారీగా అభిమానులు హాజరై కన్నీటి నివాళులు అర్పించారు. దివ్యాంక సిరోహి ఇలా చిన్న వయస్సులో మృతి చెందడం ఆమె కుటుంబానికి, అభిమానులకు ఇది తీరని లోటుగా మిగిలిపోయింది.

# ప్రభాస్ అభిమానిపై దాడి..

## సుదర్శన్ థియేటర్ వద్ద ఉద్రిక్తత.. అసలేం జరిగింది?




హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. 'రెబల్ స్టార్' ప్రభాస్ నటించిన 'డార్లింగ్' సినిమా విడుదలై 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 4K వెర్షన్‌లో గ్రాండ్ గా రీ రిలీజ్ చేయగా.. ఈ వేడుకలతో థియేటర్ ప్రాంగణం ఒక్కసారిగా రణరంగంగా మారింది. ఈ ఘటనలో థియేటర్ యాజమాన్యం ఒక అభిమానిపై దాడికి పాల్పడటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ గొడవకు సంబంధించి రెండు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. సినిమాలోని కొన్ని పాటలను మేనేజ్‌మెంట్ కట్ చేయడంతో, దానిని ప్రశ్నించినందుకు తమపై సిబ్బంది చేయి చేసుకున్నారని అభిమానులు ఆరోపిస్తుండగా.. మరోవైపు, సదరు వ్యక్తి మద్యం మత్తులో అక్కడి మహిళా సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించాడని, మిడిల్ ఫింగర్ చూపిస్తూ దుర్భాషలాడటం వల్లే తాము స్పందించాల్సి వచ్చిందని థియేటర్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం బాధితురాలికి యాజమాన్యం చికిత్స అందిస్తూనే, నిందితుడిపై కఠిన చర్యలకు డిమాండ్ చేస్తోంది. ఇక భారీ రెస్పాన్స్‌తో హౌస్‌ఫుల్ షోలతో సాగుతున్న ఈ వేడుకల్లో ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగడం పట్ల అటు అభిమానులు, ఇటు సినిమా వర్గాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# సినిమా

## తమన్నాతో బ్రేకప్ తర్వాత..

# విజయ్ వర్మ లైఫ్‌లో కొత్త టర్న్..



సినీ పరిశ్రమలో ప్రేమలు, బ్రేకప్‌లు కొత్త విషయం కాదు. కానీ కొన్ని జంటలు విడిపోతే మాత్రం అభిమానులకు జీర్ణించుకోవడం కష్టమే. అలాంటి జంటల్లో విజయ్ వర్మ - తమన్నా భాటియా ఒకటి. దాదాపు రెండేళ్ల పాటు గాఢమైన ప్రేమలో ఉన్న ఈ జంట త్వరలో పెళ్లి చేసుకుంటారని అభిమానులు భావించారు. అయితే అనూహ్యంగా వీరిద్దరూ విడిపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇద్దరూ కలిసి నటించిన లస్ట్ స్టోరీస్ 2 షూటింగ్ సమయంలోనే దగ్గరయ్యారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో తమ సంబంధాన్ని పరోక్షంగా అంగీకరించారు. అయితే 2025 ప్రారంభం నుంచి వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని వార్తలు వినిపించాయి. ముఖ్యంగా పెళ్లి విషయంలో అభిప్రాయ భేదాలే బ్రేకప్‌కు కారణమని బీటౌన్‌లో టాక్ వినిపించింది. తమన్నా తన సోషల్ మీడియా ఖాతాల నుంచి విజయ్‌తో ఉన్న ఫోటోలను తొలగించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. 2025 మార్చి నాటికి వీరిద్దరూ అధికారికంగా విడిపోయినట్లు సమాచారం. తమన్నాతో విడిపోయిన కొద్ది కాలానికే విజయ్ వర్మ మరో నటితో కలిసి తిరుగుతుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబైలో విజయ్ వర్మ, అలియా ఖురేషితో కలిసి డిన్నర్‌కు వెళ్లిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరూ కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లడం వంటి విజువల్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. గతంలో విజయ్ వర్మ, ఫాతిమా సనా షేక్‌తో డేటింగ్ చేస్తున్నారనే రూమర్స్ కూడా వినిపించాయి. అయితే తాజా పరిణామాలతో అలియా ఖురేషితో కొత్త బంధం మొదలైందా? అనే అనుమానాలు నెటిజన్లలో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం విజయ్ నటిస్తున్న 'మట్కా కింగ్' సిరీస్‌లో అలియా కూడా భాగం కావడం గమనార్హం. షూటింగ్ సమయంలో ఏర్పడిన పరిచయం మరింత దగ్గరగా మారిందనే ప్రచారం జరుగుతోంది. అలియా ఖురేషి బాలీవుడ్‌లో ఎదుగుతున్న యువ నటి. షారుఖ్ ఖాన్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం జవాన్‌లో కీలక పాత్రలో కనిపించింది. అందులో 'జాన్వి' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నటిగానే కాకుండా, అలియా ఒక మంచి గాయని, సాంగ్ రైటర్ కూడా. వెబ్ సిరీస్‌ల ద్వారా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తోంది. ప్రస్తుతం విజయ్ వర్మ, అలియా ఖురేషి డేటింగ్ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటనలేదు. ఇవి కేవలం రూమర్స్ మాత్రమేనా, లేక నిజంగానే కొత్త ప్రేమ కథ మొదలైందా అన్నది తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# అప్పులు తీరేనా.. స్లమ్‌డాగ్ వచ్చేనా!



టాలీవుడ్‌లో ఒకప్పుడు సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు..స్టార్ హీరోలందరి హాట్ ఫేవరెట్.. అంటే ముందు వినిపించే పేరు పూరీ జగన్నాథ్. ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న పూరీ ఎంత పెద్ద సినిమాను అయినా చాలా తక్కువ సమయంలో పూర్తి చేయడంలో దిట్ట. అప్పట్లో పూరీ సినిమా అంటే చాలు బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురవాల్సిందే. అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రస్తుతం ఈ సెన్సేషనల్ డైరెక్టర్ కెరీర్‌లోనే అత్యంత క్లిష్టమైన బ్యాడ్ టైమ్‌ను ఫేస్ చేస్తున్నారు. ఆయన సృష్టించిన వండర్స్ ఒక వైపైతే.. ఇప్పుడు ఆయన చుట్టూ ఉన్న వివాదాలు, ఆర్థిక ఇబ్బందులు మరోవైపు ఉన్నాయి. ముఖ్యంగా స్లమ్‌డాగ్ సినిమా చుట్టూ ఇప్పుడు నెలకొన్న పరిస్థితులు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. 'లైగర్' సినిమాతో అసలు సమస్య మొదలైంది. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ అంచనాలతో వచ్చిన ఆ చిత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ సినిమా నష్టాల వల్ల డిస్ట్రిబ్యూటర్లు రోడ్డున పడ్డారు. ఆ సమయంలో వారికి కొంత వరకు బాధ్యత వహిస్తానని, నష్టపరిహారం అందిస్తానని పూరీ హామీ ఇచ్చారు. కానీ, ఆ తర్వాత ఎంతో నమ్మకంతో చేసిన డబుల్ ఇస్మార్ట్ కూడా బాక్సాఫీస్ వద్ద చేతులెత్తేసింది. దీంతో డిస్ట్రిబ్యూటర్ల కష్టాలు రెట్టింపు అయ్యాయి. మొదటి సినిమా నష్టాలే తీరలేదు అనుకుంటే, రెండో సినిమా కూడా దెబ్బకొట్టడంతో తలనొప్పులు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇప్పుడు అసలు కథ స్లమ్‌డాగ్ దగ్గరికి వచ్చింది. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో పూరీ తెరకెక్కించిన ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. ఈ కాంబినేషన్ మీద ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. కానీ, సినిమా రిలీజ్ చేయడానికి పూరీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాత బకాయిలు తీరిస్తేనే ఈ సినిమాను థియేటర్లలోకి రానిస్తాం అంటూ డిస్ట్రిబ్యూటర్లు భీష్మించుకుని కూర్చున్నారు. థియేటర్ రిలీజ్ మాత్రమే కాదు, ఓటీటీ డీల్స్ విషయంలో కూడా ఇదే నిబంధన అడ్డుపడుతోంది. బకాయిలు క్లియర్ చేయకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కూడా ముందడుగు వేయడం లేదు. ప్రస్తుతం పూరీ ఈ ఆర్థిక సమస్యలను అధిగమించే పనిలో బిజీగా ఉన్నారు. ఎలాగైనా పాత అప్పులను క్లియర్ చేసి, స్లమ్‌డాగ్ సినిమాను ప్రేక్షకులకు అందించాలని చూస్తున్నారు. తన మార్కు డైలాగులతో, క్యారెక్టరైజేషన్‌తో మ్యాజిక్ చేసే పూరీ.. ఈ రియల్ లైఫ్ క్రైసిస్ నుంచి ఎలా బయట పడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒక సినిమా సక్సెస్ అయితేనే ఈ సమస్యలన్నీ తొలగిపోతాయి. మరి విజయ్ సేతుపతి సినిమా పూరీకి ఆ ఊపిరిని ఇస్తుందో లేదో చూడాలి.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411